క్లుప్తంగా

తైబజార్

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని గౌతంనగర్ డివిజన్ మల్లికార్జుననగర్ ప్రధాన రోడ్డు మార్గంలో శనివారం తైబజార్(వారాంతపు సంత) జరుగుతుంది.

వైద్య సేవలు

అల్వాల్, మల్కాజిగిరి, జవహర్‌నగర్, మౌలాలి ప్రభుత్వ ఆసుపత్రులలో శనివారం చిన్నపిల్లలకు టీకాలు. దంత పరీక్షలు, జనరల్ చికిత్సలు, కంటి పరీక్షలు నిర్వహిస్తారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: చెట్ల కొమ్మల తొలగిస్తున్నందున మౌలాలి సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో శనివారం కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు శుక్రవారం ఏఈఓ ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరనగర్ కాలనీ, ఏపీఐఐసీ కాలనీ, ఇందిరానగర్ ఫేజ్-2, భారత్ ఫంక్షన్‌హాల్, జేబీ గార్డెన్ బ్యాక్ సైడ్, హెచ్‌బీకాలనీ ఎల్ఐజీ, లక్ష్మీనగర్ కాలనీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంటు ఉండదని తెలిపారు.

ఉచితంగా షుగర్, కంటి పరీక్షలు

మల్లాపూర్: మల్లాపూర్ సెంట్రల్ బ్యాంక్ సమీపంలో అన్నపూర్ణ కాలనీలోని శ్రీవిజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచితంగా 12 తేదీ నుంచి 19 తేదీ వరకు వారం రోజుల పాటు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు షుగర్, కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఊట్కూరి శ్రీనివాస్ తెలిపారు. వైద్య శిబిరాన్ని మల్లాపూర్ వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్: 91778 75975, 9553019581.

ఉదయ్‌కుమార్‌రెడ్డికి బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు

బోడుప్పల్: చెంగిచర్లలోని శ్రీరాజమాత ఫౌండేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్‌రెడ్డిలకు బెస్ట్ సోషల్ వర్కర్-2023 అవార్డు వచ్చింది. ఈ మేరకు మహారాష్ట్రకు చెందిన సోషల్ పాయింట్ ఫౌండేషన్ వారు ప్రైడ్ ఆఫ్ ఇండియా(బెస్ట్ సోషల్ వర్కర్-2023) అవార్డు అందజేసినట్లు ఉదయకుమార్‌రెడ్డి వెల్లడించారు. చెంగిచర్లలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తాము చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని, అంతేగాకుండా మరింత బాధ్యత పెంచిందన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తూ..

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ కైలాసగిరిలో ఈ నెల 14న నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ శుక్రవారం సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాసరెడ్డి, కాలనీ సభ్యులు బాలరాజు, బాలనరసింహ, రామకృష్ణ పాల్గొన్నారు.

త్రిషారెడ్డిని అభినందించిన బీఎల్ఆర్



కుషాయిగూడ: అండర్-18 మహిళల టీ-20 ప్రపంచకప్‌లో భారత జట్టుకు ఎంపికైన గొంగిడి త్రిషారెడ్డిని శుక్రవారం బీఎల్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి అభినందించారు. భద్రాది, కొత్తగూడెంకు చెందిన త్రిషారెడ్డి భారత జట్టులో స్థానం సంపాదించడం తెలంగాణకే గర్వకారణమన్నారు. ఆమె భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. త్రిషారెడ్డికి కావాల్సిన తోడ్పాటు అందిస్తానన్నారు.

పండగలను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ నర్సింహస్వామి

అల్వాల్: రానున్న షబే బరాత్, షబే మేరాజ్ జగ్నే-కి-రాత్ (జాగారాలు) శాంతియుతంగా జరుపుకోవాలని నేరేడ్‌మెట్ సీఐ నర్సింహస్వామి అన్నారు. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ముస్లిం పెద్దలతో ఆయన పీస్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. జగ్నే-కి-రాత్ వేడుకలను ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు.

100 ఫీట్ల రోడ్డు.. నిత్యం పాట్లు



కంకర తేలి గుంతలమయంగా మారిన ఉప్పల్ నుంచి చిలుకానగర్ వెళ్లే రహదారి

ఉప్పల్: ఈ రోడ్డు చూశారా.. కాదు కాదు.. ఈ రోడ్డు మీదుగా ప్రయాణం చేశారా.. అయితే బాడీ పెయిన్స్ రావాల్సిందే.. ఒక్క రోజుకే ఇలా జరిగితే మరి ప్రతిరోజూ ఈ రోడ్డుపై ప్రయాణించే వారి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. నిత్యం ఈ రహదారిపై ప్రయాణించే వారి వాహనాలు షెడ్డుకు.. వాహనదారులు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. వంద ఫీట్ల రోడ్డయినా నిత్యం ఫీట్లు చేయాల్సిందే. నాలుగు నెలలుగా ఈ రోడ్డు పరిస్థితి ఇలాగే ఉంది. ఇదేదో మారుమూల ప్రాంతంలో ఉన్న రోడ్డు అనుకుంటే మాత్రం పొరపాటే.. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఉప్పల్ టు చిలుకానగర్ వెళ్లే 100 ఫీట్ల రోడ్డు. ప్రతిరోజూ వేల మంది ఈ రహదారి మీదుగా ప్రయాణిస్తుంటారు. ఉప్పల్ నుంచి నాచారం, మల్లాపూర్, ఈసీఐఎల్, చర్లపల్లి, పారిశ్రామికవాడలకు ఇదే రహదారి. వీటితో పాటు సమీప కాలనీలు దాదాపు 50కి పైగానే ఉంటాయి. ఉప్పల్ లిటిల్‌ఫ్లవర్, కేంద్రీయ విద్యాలయ-1, 2లతో పాటు ఎన్నో ప్రైవేటు పాఠశాలలకు వెళ్లాలంటే ఈ రహదారి నుంచే వెళ్లాల్సి ఉంటుంది. ప్రజల సౌకర్యార్థం రూ.కోట్లు ఖర్చు చేసి కావేరినగర్ వద్ద వంతెన నిర్మించి నెలలు గడుస్తున్నా రోడ్డు వేసేందుకు అధికారులకు సమయం దొరకడం లేదు. కంకర తేలిన రోడ్డు, గుంతలమయంగా మారి ప్రయాణికులు అవస్థలు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉప్పల్ జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి రోడ్డు వేయాలని స్థానికులతో పాటు ప్రయాణికులు కోరుతున్నారు.

పార్టీ పటిష్టతకు కలిసి పనిచేయాలి



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు

మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

అల్వాల్: బీజేపీ పటిష్టతకు అందరూ కలిసి పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు అన్నారు. మచ్చబొల్లారంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారతీయ జనతా పార్టీ కార్యాలయాన్ని ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇందుకోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దుండుగుల వెంకటేష్, ఆర్‌కే.శ్రీనివాస్, మల్లికార్జున్‌యాదవ్, మల్లికార్జున్‌గౌడ్, సదానంద్‌గౌడ్, జిల్లెల రవియాదవ్, ప్రకాష్‌చౌదరి, గోపి, శ్రీనివాస్, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన ఐలా ప్రతినిధులు



రాచకొండ సీపీ చౌహాన్‌తో చర్లపల్లి ఐలా ప్రతినిధులు

కుషాయిగూడ: రాచకొండ సీపీగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్ చౌహాన్, మల్కాజిగిరి డీసీపీ జానకిని శుక్రవారం చర్లపల్లి పారిశ్రామికవాడ ఐలా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పారిశ్రామికవాడలో నూతన పోలీస్‌స్టేషన్ నిర్మాణ విషయాన్ని సీపీ దృష్టికి తీసుకెళ్లగా ఇప్పటికే పోలీస్‌స్టేషన్ నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధమైనట్లు తెలిపారు. అందుకు సంబంధించి స్థలాన్ని టీఎస్‌ఐఐసీ నుంచి అలాట్ అయ్యేలా చూడాలని వారికి సూచించారు. ఐలా చైర్మన్ రోషిరెడ్డి, సెక్రటరీ వెంకటేశ్వర్‌రెడ్డి, హనుమాన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకానగర్‌లో విస్తృత పర్యటన



సీతారామకాలనీలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ జలమండలి అధికారులతో కలిసి శనివారం విస్తృతంగా పర్యటించారు. సీతారామకాలనీలో జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్ ఈఈ నాగేందర్, జలమండలి డీజీఎం రజినీకాంత్‌రెడ్డితో కలిసి నూతనంగా నిర్మిస్తున్న వరద నీటి పైపులైన్లు, సీసీ రోడ్ల నిర్మాణం తదితర పనులను పర్యవేక్షించారు. ప్రజలకు ఇబ్బంది కలిగే పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానికులు, టీఆర్ఎస్ నాయకులు జగన్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలా కంటి వెలుగు

కుషాయిగూడ: రాష్ట్రవ్యాప్తంగా కంటి వెలుగు ఉద్యమంలా కొనసాగుతోందని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. ఐలా, సీఐఏ విజ్ఞప్తి మేరకు చర్లపల్లి పారిశ్రామికవాడలో పనిచేసే కార్మికుల కోసం చర్లపల్లి అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. డాక్టర్ శిరీష, బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, బొడిగె ప్రభుగౌడ్, శ్రీకాంత్‌యాదవ్, ధనుంజయ్‌గౌడ్, భానుచందర్, పాండు పాల్గొన్నారు. అనంతరం చర్లపల్లిలోని శ్మశానవాటికలో రోడ్డు నిర్మాణం పనులతో పాటు చిన్న చర్లపల్లి నుంచి పెద్ద చర్లపల్లి బస్టాప్ వరకు రోడ్డు పనులను పరిశీలించారు.



కంటి అద్దాలు అందజేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

లిక్కి వినయ్‌రెడ్డిపై పీడీ యాక్టు



నిందితుడు లిక్కి వినయ్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ డబుల్ మర్డర్ కేసుల్లో నిందితుడైన లిక్కి వినయ్‌రెడ్డి(31)పై రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ పీడీ యాక్ట్‌ను ప్రయోగించారు. గతేడాది అక్టోబర్ 14వ తేదీన అందరూ చూస్తుండగానే ఉప్పల్‌లోని పూజారి ఇంట్లోకి చొరబడిన వినయ్‌రెడ్డి అతడి స్నేహితుడు బాలకృష్ణ పూజారి నరసింహస్వామితో పాటు అతడి కొడుకు శ్రీనివాస్‌ను దారుణంగా నరికి చంపిన ఘటన నగరంలో సంచలనం సృష్టించిన సంగతి విదితమే. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చిన వినయ్‌రెడ్డిపై ముందస్తు చర్యగా పీడీ యాక్ట్ నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి తెలిపారు.

యువతి అదృశ్యం



లావణ్య(ఫైల్)

అల్వాల్: యువతి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నర్సింహస్వామి వివరాల ప్రకారం .. నేరేడ్‌మెట్ శ్రీసాయినగర్‌లో నివాసముండే గోవిందరాజు ఈ నెల 8వ తేదీన తన పెద్ద కుమార్తె వివాహ నిశ్చితార్థం కోసం షాపింగ్‌కు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంట్లో ఉన్న చిన్న కుమార్తె లావణ్య అదృశ్యమైంది. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. తండ్రి గోవిందరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



బోడుప్పల్: పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ దేవాలయంలో శుక్రవారం ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కృష్ణుడు, సత్యభామ, రుక్మిణి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పన్నాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ ద్వారతోరణ పూజ, అగ్నిముఖం, కల్యాణోత్సవం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు వెల్లడించారు. సాయంత్రం ఊరేగింపు, ఏకాంత సేవ నిర్వహించినట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

బోడుప్పల్: డివిజన్ పరిధిలో ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని 17వ డివిజన్ కార్పొరేటర్ పోగుల నర్సింహారెడ్డి అన్నారు. ఎస్ఐఎన్ కాలనీలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన సందర్శించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు డివిజన్‌లోని ప్రజలకు కంటి పరీక్షలు చేస్తారని, అందరూ పరీక్షలు చేయించుకుని కళ్ల అద్దాలు తీసుకోవాలన్నారు. వార్డు ఆఫీసర్ బాలనర్సమ్మ, వైద్య బృందం పాల్గొన్నారు.

కార్పొరేటర్ శ్రీవాణి హౌస్ అరెస్ట్



రామంతాపూర్: జీహెచ్‌ఎంసీ బీజేపీ కార్పొరేటర్లు శుక్రవారం తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి ఆందోళన కార్యక్రమానికి వెళ్లకుండా ఉప్పల్ పోలీసులు శుక్రవారం రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్రావును ముందస్తు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023-2024 బడ్జెట్‌లో జీహెచ్‌ఎంసీకి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. జీహెచ్‌ఎంసీలో ఈసారి ఎక్కువ సంఖ్యలో బీజేపీ కార్పొరేటర్లు ఉన్నందున ప్రభుత్వ పక్షపాతం చూపుతూ నిధులు కేటాయించకపోవడం వంటి చేష్టలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

మౌలాలి కార్పొరేటర్ హౌస్ అరెస్ట్



కార్పొరేటర్ సునీతని హౌస్ అరెస్ట్ చేసిన దృశ్యం

మౌలాలి: జీహెచ్‌ఎంసీ బీజేపీ కార్పొరేటర్లు శుక్రవారం తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి ఆందోళన కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు శుక్రవారం మౌలాలి కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్‌ను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు.



హబ్సిగూడలో రాగిడి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు

ఘనంగా రాగిడి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు





హబ్సిగూడ: ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలను పెద్దఎత్తున నిర్వహించారు. హబ్సిగూడ వీవీనగర్‌లో ఉచిత మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా చిలుకానగర్‌లో మధుర చారిటబుల్ ట్రస్ట్ ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో, హబ్సిగూడలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో అన్ని డివిజన్ల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కేక్ కట్ చేయించి ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భవనం అనిరుధ్‌రెడ్డి, శ్రీసిద్ధి వినాయక ప్రాపర్టీస్ మేనేజింగ్ డైరెక్టర్ డి.శరత్‌బాబు, ఎస్.ప్రభాకర్‌రెడ్డి, పి.నర్సింహారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ డివిజన్ల కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాలు, యువజన, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



హబ్సిగూడ వీవీనగర్‌లో రక్తదానం చేస్తున్న యువత

మాజీ ఎమ్మెల్యే చింతల కనకారెడ్డికి ఘన నివాళి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే చింతల కనకారెడ్డి జయంతిని శుక్రవారం అల్వాల్‌లోని హరిజన బస్తీ పోచమ్మగుడి దగ్గర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌వీఎం ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ముందుగా కనకారెడ్డి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైద్య శిబిరంలో బీపీ, కంటి పరీక్షలు, జనరల్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు లక్ష్మణ్, రవళి, నాగశివ, అభినయ, నాయకులు ఉదయ్, మహిళా నాయకురాలు కవిత, బబిత, సూర్యకిరణ్, ప్రవీణ్, మధు, దేవేందర్, నాగేశ్వరరావు, వెంకటేష్‌గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'పట్టణ ప్రగతిలో ప్రజాప్రతినిధుల పాత్ర'పై శిక్షణ



మున్సిపల్ కౌన్సిలర్లకు సర్టిఫికెట్లను అందజేస్తూ..

మేడిపల్లి: వరంగల్ జిల్లా కేంద్రంలోని వర్ధన్నపేట, నర్సంపేట్, పరకాల పట్టణాల మున్సిపల్ కౌన్సిలర్లకు రీజనల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్మెంటల్ స్టడీస్(ఓయు) ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహించారు. పట్టణ ప్రగతిలో ప్రజాప్రతినిధుల పాత్ర అనే అంశంపై శుక్రవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పాల్గొని పీర్జాదిగూడలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిపై పవర్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. మున్సిపల్ చట్టాలు, స్థానిక సంస్థలు, పాలకవర్గాలు చేయాల్సిన విధి విధానాలపై వివరించారు. ప్రజల మద్దతు ఉంటేనే ప్రజాప్రతినిధులుగా కీర్తించబడతామని ఆయన స్పష్టం చేశారు. పీర్జాదిగూడ అభివృద్ధి పట్ల మంత్రముగ్ధులైన వర్ధన్నపేట, నర్సంపేట్, పరకాల మున్సిపల్ కౌన్సిలర్లు మేయర్ జక్కా వెంకట్ రెడ్డిని అభినందించారు. అనంతరం పీర్జాదిగూడ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి చూసేందుకు త్వరలో స్టడీటూర్‌లో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌ను వర్ధన్నపేట, నర్సంపేట్, పరకాలకు చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు సందర్శిస్తామన్నారు. అనంతరం ప్రతినిధులకు సర్టిఫికెట్లను అందజేశారు.

మురుగు శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన కార్పొరేటర్



నాచారంలో ఎస్టీపీ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం హెచ్‌ఎంటీనగర్ పెద్ద చెరువుపై రూ.30 కోట్లతో నిర్మిస్తున్న 17.5 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఎస్టీపీ (మురుగు శుద్ధి కేంద్రాన్ని) శుక్రవారం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. త్వరలోనే మంత్రి కేటీఆర్ చేతులమీదుగా ఎస్టీపీని ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి ఎస్టీపీ డిపార్ట్‌మెంట్ అధికారి డీజీఎం నాగేశ్వర్‌రావు, గ్రేటర్ బీఆర్ఎస్ నేతలు సాయిజెన్‌శేఖర్, కట్ట బుచ్చన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యూటర్న్ వద్ద నిత్యం ప్రమాదాలు

రామంతాపూర్: ప్రధాన రహదారిలో పెద్ద చెరువు ఎదురుగా ఉన్న రోడ్డు డివైడర్‌ను పది రోజుల క్రితం తొలగించి కొత్తగా ఏర్పాటు చేసిన యూటర్న్ సరిగా లేకపోవడంతో మలుపు నుంచి వెళ్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. గతంలో డీ మార్ట్ ఎదురుగా ఉన్న యూటర్న్ మూసివేయడంతో స్థానికంగా ఉన్న పలు బస్తీలు, కాలనీల వాహనదారులు గ్రాండ్ స్వాగత్ హోటల్ ఎదురుగా ఉన్న యూటర్న్ నుంచి ఉప్పల్, హబ్సిగూడకు ఎటువంటి ప్రమాదాలు లేకుండా సాఫీగా వెళ్లేవారు. అయితే కొత్తగా రోడ్డు మధ్యలో అటు ఇటు కాకుండా ఏర్పాటు చేసిన ఈ యూటర్న్‌తో ఎటువంటి ఉపయోగం లేకపోగా ప్రమాదాల జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మధ్యలో డివైడర్లను తీసి ఈ యూటర్న్ ఏర్పాటు చేసింది ట్రాఫిక్ పోలీస్ విభాగం వారేనా.. లేక ఇతరులు ఎవరైనా చేశారా అని స్థానికులు అంటున్నారు. ఉపయోగం లేని యూటర్న్ తొలగించి తిరిగి డివైడర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



కొత్తగా ఏర్పాటు చేసిన యూటర్న్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657